కబుర్లు చెప్పుకుంటూ, భోజనాలు చేసి సాయంత్రం సినిమాకో. షికారుకో వెళ్ళడం అలవాటయిన కార్యక్రమంగా మారింది, ఆ రోజంతా నిమిషంలా గడిచి పోయేది. ఆదివారం ఎప్పుడొస్తుందా అని మిగతా రోజులు నిరీక్షించడం, రజియా గురించి ఆలోచించడం తప్ప మరే ధ్యాస లేకుండా తయారయ్యాను. హాస్పిటల్ డ్యూటీ ఏదో యాంత్రికంగా చేసేవాడిని. రమ, శకుంతల మమ్మల్నిద్దరిని హాస్యాలు పట్టిస్తూ ఏడపిస్తూండేవారు. రజియా కోపం నటిస్తూ ఇద్దరిని కేకలు వేసేది – అది నటన అని ఆహాస్యోక్తులు వినడం మా యిద్దరికీ యిష్టమేననీ నాకు తెలుసు–సినిమాకి వెడితే కావాలని రజియాని నా ప్రక్కన కూర్చో పెట్టేవారు.

రమ, శకుంతల–సినిమాలో ప్రేమ సన్నివేశాలని చూస్తూంటే నన్నూ,రజియాని ఆ దృశ్యాలలో ఊగిస్తూ, రజియా స్పర్శకి పులకిస్తూ నన్ను నేను మరిచే పులకింతలో వుండేవాడిని – రజియా నా ప్రక్కన కూర్చోడానికే సిగ్గు పడుతూ ఒదిగి కూర్చునేది – అది గమనించనట్టు మాట్లాడే నెపంతో, చూడనట్టు రజియా వైపు వంగి ఆమెతో మాట్లాడుతూండేవాడిని. ఏ చెయ్యో తగిలితే రజియా ముడు చుకుపోయేది. కొంటెగా చూసేవాడిని. నా కళ్ళలోకి చూడలేనట్టు సిగ్గుతో కళ్ళు వాల్చుకునేది రజియా.

ప్రతి రోజు – ప్రతి క్షణం – ప్రతి సంఘటన రజియాని నన్ను దగ్గర చేర్చింది. రజియాతో పరిచయం అయ్యే వరకు స్త్రీ పురుష ఆకర్షణ యింత తీయగా వుంటుందన్న సంగతి నాకు తెలియదు. అసలు వుండే స్త్రీ పురుష హృదయాలు ఒకరి సన్నిధిలో ఒకరుంటే యింతలా స్పందిస్తాయన్నది ఎందరి గుండెలనో తనిఖీ చేసిన నా స్టెతస్కోపు తెలియచెప్పలేదు. రజియా పట్ల నాకున్నది ప్రేమ, ఆకర్షణా, మోహమా దీని పేరేమిటో గాని మనిషిని యింతలో సర్వం మరిచి పోయేట్టు చేస్తుందని యిది వరకు నాకు తెలియదు. ప్రేమ కోసం రాజ్యం తృణ ప్రాయంగా వదిలిన రాజు పిచ్చివాడని ఇన్నాళ్ళు అన్పించేది. కాని యిప్పుడర్థం అయింది. లైలా మజ్నూలు, రోమియో జూలియట్‌ల కథలన్నీ కేవలం అభూత కల్పన లనుకున్నాను యిన్నాళ్లూ. కాదని యిప్పుడు తెలుసుకున్నాను. ఈ రెండునెలల పరిచయంలో రజియా లేనిదే నా జీవితానికి పరిపూర్ణత సిద్ధించదన్న నిజం పూర్తిగా గుర్తించాను. తక్కిన లోకం ఏమయిపోనీ రజియా నాకు కావాలి అన్న నిర్ణయానికి వచ్చేశాను—కాని రజియాతో ఎలా చెప్పను ! ఇన్నాళ్ళు స్నేహితుల్లా

తిరిగాం_చనువుగా మాట్లాడుకున్నాం, కళ్ళతో పలకరించుకున్నాం తప్ప హృదయాలు విప్పి చెప్పుకోలేదు. రజియా మనసు నా మనసులాగానే ఆలోచిస్తుందన్న నమ్మకం నాకుంది. రజియాకి నా మనసువిప్పి చెప్పే సందర్భం యింకా జతపడలేదు.

రజియా తల్లి హఠాత్తుగా గుండెనొప్పి వచ్చి చనిపోయింది - ఆ ఆదివారం నేను వెళ్ళేసరికి రమ అందించిన వార్త అది. రజియా ప్రపంచంలో ఏకాకి అయిపోయిందన్నమాట. రజియాకి సానుభూతి చూపడానికి, ఓదార్చడానికి వూరు వెడితే అన్పించింది_రమ, శకుంతల రేపు వెడుతున్నారట - వాళ్ళది ముస్లిమ్ సాంప్రదాయం_పరాయి మగవాడు స్నేహితుడు అని చెప్పుకుంటూ వెడితే బంధువులు ఏమనుకుంటారో వెళ్ళడం మంచిదికాదన్న శకుంతల అభిప్రాయం నిజమే అన్పించింది. నా తరపున వాళ్ళని రజియాకి నా సానుభూతి అందించి, నేరాని కారణం చెప్పమని చెప్పి_రజియాకి ఉత్తరం రాసి యిచ్చాను.

ఊరినించి వచ్చిన రమ శకుంతలలు అందించిన వార్తకి చకితుడనయి పోయాను తల్లి పోంగానే ఏకాకి అయిన రజియాని చెప్పుకోడానికి మాత్రమే అన్న అయిన అతను వచ్చి చదువు మాన్పించి ఊరికి తీసుకెళ్ళడానికి నిర్ణయం చేశాడని - రజియా చదువింక మూడునెలలుంది. ఈ మూడునెలలు నన్ను ఆదుకో అంటూ ఎంత ప్రార్థించినా అన్న వినడం లేదని, రజియా ఏంచెయ్యాలో తోచక కన్నీరు మున్నీరుగా విలపిస్తూందని-అన్నగారింట్లో పనిమనిషిగా మాత్రమే స్థానం ఉంటుందని తనని ఆదుకొనేవారు ఎవరని స్నేహితురాళ్ళని కౌగలించుకొని ఏడ్చిందట. రమ,శకుంతల ఎంత చెప్పినా ఆ అన్న వినలేదట. వదినగారు జీతం లేని దాసి దొరికినందుకు సంతోషిస్తూందని,పదోరోజు కాంగానే రజియాని అన్న వెంటబెట్టుకు పోతాడనీ అక్కడ జరిగిన సంగతులన్నీ చెప్పారు. అంతా వినగానే రజియా దుస్థితికి చలించాను. ఏంచెయ్యాలో తోచని అయోమయంలో వుండిపోయాను. ఆఖరికి రమే ధైర్యంచేసి "మీరు ధనవంతులు_రజియాకి డిగ్రీ చేతికి వచ్చేవరకు కాస్త ఆదుకోలేరా. రజియాకోసం ఆ మాత్రం సహాయం చెయ్యలేరా అంది. కర్తవ్యం అర్ధమయి తప్పకుండా ఆదుకుంటాను. నా మనసులో మాట చెప్పావు" అంటూ అభినందించాను_'కాని నా సహాయం రజియా అంగీకరిస్తుందా? రజియా అంగీకరించినా అన్న వప్పుకుంటాడా. అపరిచితుడైన నేను ఏ అధికారంతో రజియా భారంస్వీకరిం

చను? అంటూ సందేహించాను. ఎంత స్వాభిమానం అన్నా, ఆ నరకంలోంచి బయట పడడానికి రజియా మీ సహాయం తప్పక స్వీకరిస్తుంది. ఎటొచ్చి ఆ అన్నే ఏమంటాడో. అతన్ని మీరి కాస్త ఎదుర్కొని నచ్చచెప్పండి" అంది శకుంతల. ఏమయినా సరే రజియాని దుస్థితి నించి కాపాడాలని నిర్ణయించుకున్నాను.

రజియా ఊరుచేరాను. రజియా అన్నని చూడగానే సదభిప్రాయం కలగలేదు. నే నెవరో–ఎందుకొచ్చానో వివరాలు పదేపదే అడిగి ఎన్ని చెప్పినా రజియాని ఓ పట్టాన నన్ను చూడనీయలేదు. రజియాకి మగ స్నేహితులుకూడ ఉన్నారన్న మాట. పట్నంలో వెలగబెడుతున్న చదువు యిదన్నమాట. అంటూ మొరటగా వ్యంగ్యోక్తులు, హేళనలు విసిరాడు. తమ స్త్రీలకి పరదాలని పురుషులని చూడరాదని పట్నంలో ఏ భాగోతం ఆడినా ఇప్పుడు ఇంటినిండా బంధువులమధ్య తన గౌరవం నిలుపుకోవాలి గనక రజియాని చూసే వీలులేదు, అని చెప్పాడుఖచ్చితంగా అంత దూరంవచ్చి రజియాని కనీసం చూడనైనా చూడకుండా ఎలా వెళ్ళగలను అంతటి నిస్సహాయ స్థితిలో రజియా ఖర్మానికి రజియాని వదలి వెళ్ళలేకపోయాను. ఏం చెయ్యాలో అంతుబట్టలేదు. ఆ క్షణంలో భగవంతుడే పంపినట్లు ఓ గదిలోంచి రజియా బయటకి వస్తూ కనిపించింది. వీధి వరండాలో కూర్చున్ననాకు. 'రజియా' ఆనందంగా అరిచాను.–రజియా ఒక్క–క్షణం దిగ్భ్రాంతితో చూస్తూ నిలబడపోయి మరుక్షణం పరిగెత్తి గుమ్మం దగ్గిరకి వచ్చింది. 'మీరు–మీరు వచ్చారా?' ఆనందోద్రేకంతో అంది–రజియా యీ వారంలో గుర్తుపట్టలేనంతగా మారింది. కళ్ళక్రింద నల్లని చారలు–లోతుకుపోయిన కళ్ళు – ఏడ్పుతో ఉబ్బిన కళ్ళు, శోక దేవతలా కనపడిన రజియాని చూసి 'రజీయా' అని మాత్రం అనగలిగాను. రజియాకి నన్ను చూడగానే దుఃఖం కట్టలు తెంచుకు వచ్చింది. చేతులలో మొహం దాచుకుని ఏడవ సాగింది.

"ఊరుకో రజియా" అంటూ ఓదార్పుగా దగ్గరకి వెళ్ళబోయాను. ఒక్క–క్షణంలో జరిగిన ఈ సంఘటనని ఆశ్చర్యంగా చూస్తున్న రజియా అన్న తెలివి తెచ్చుకుని 'రజియా లోపలికి వెళ్లు' అన్నాడు కఠినంగా– రజియా అన్న కోపానికి కాస్త బెదురుతూ నన్నుచూసి ఏదో అనబోయింది, "పట్నంలో వేసిన వేషాలు చాలు చదువు వంకతో చేస్తున్న పని యిదన్నమాట యింక యింట్లోకి నడు." రజియా కలవరపడుతూ నాకు అవమానం జరుగుతుందన్న భయంతో నా వంక. అన్న వంక చూస్తూ భయ్యా'

అంటూ ఏదో అనబోయింది– "అయ్యా – తమరెవరో యింక వచ్చిన పని అయింది వెళ్ళండి రజియాని చూశారుగా యింక కదలండి" అన్నాడు కరకుగా లేచి నిలబడి. రజియాని లోపలికి తోసి 'సిగ్గు ఎగ్గు లేకుండా మగవాళ్ళ ముందు నిలబడ్తావేం యింకా, అసలు నిన్నుకాదు అనాల్సింది అమ్మని అనాలి. ఊం లోపలికి వెళ్లు'అంటూ తోశాడు– రజియా బిక్కచచ్చిపోయి నిస్సహాయంగా నా వంకచూసి వణుకుతున్న చేతులతో నాకు నమస్కారం చేసి ఉబుకుతున్న కన్నీళ్ళతో లోపలికి పరిగెత్తింది. అంతటి నిస్సహాయ స్థితిలో రజియాని యీ కసాయి వాడికి అప్పగించి ఎలా వెళ్ళను అన్పించింది– యింకేం ఆలోచించకుండా మొండి ధైర్యముతో 'రజియా ఒక్కక్షణం వుండు నీతో మాట్లాడాలి' అంటూ రజియా వెంట గబగబ లోపలికి వెళ్లాను-రజియా అన్న విసురుగా 'ఏయ్ - ఆగు' అంటూ నా వెనక రావడం చూసి రజియా గది తలుపు గడియ పెట్టేశాను. రజియా విస్తుపోతూ భయవిహ్వలయై నోటి మాట రాక చూస్తూ వుండిపోయింది. రజియా అన్న పైనించి తలుపు బాదసాగాడు-రజియా తేరుకుని "యిదేమిటి. తలుపు తీయండి ముందు. లేకపోతే మా అన్నయ్య నన్ను, మిమ్మల్ని చంపేస్తాడు" అంది గాభరాగా. "ఫరవాలేదు, ఒక్కమాట చెప్పనీ రజియా. నీ గురించి రమ అంతా చెప్పింది. మీ అన్న ఎలాంటివాడో చూస్తూ నిన్నింక నిస్సహాయస్థితిలో వదిలి వెళ్ళలేను. నీ చదువుకయ్యే ఖర్చు నేను భరిస్తాను. నీవు మీ అన్నతో వెళ్ళద్దు. నాతో వచ్చేయి చదువుకుందువుగాని, నీకేం భయంలేదు. నిన్ను ఆమాత్రం ఆదుకోగలను. పద, వెంటనే ని న్నీ నరకం నుంచి తీసికెడతాను" అన్నాను తొందర తొందరగా. రజియా తెల్లపోతూ అర్థంగానట్టు చూసింది. పైనించి తలుపులు బాదడం ఎక్కువయింది.

"రజియా, ఆలోచించేందుకు టైమ్‌లేదు. పద, మీ అన్నతో చెప్పి తీసికెడతాను."

"వద్దు వద్దు– మా అన్న వప్పుకోడు– నా ఖర్మానికి నన్ను వదలండి – మీరు సహాయం చేద్దామన్నా మా అన్నయ్య అంగీకరించడు – నా మూలంగా మీకీ బాధ ఎందుకు ? వెళ్ళిపొండి. చూడండి, తలుపులు విరగ్గొడ్తున్నాడు–నన్నెలాగో వదలడు. మీరయినా అవమానం పొందకముందే వెళ్ళిపొండి–" భయంగా అంది – అంత భయంలోనూ రజియా కళ్ళు నా పట్ల కృతజ్ఞతని చూపించాయి.

'అరే బద్మాష్ – తలుపుతీయి – బయటికిరా - నిన్ను జైల్లోపెట్టిస్తా – ఊ